# ఛత్రపతి

"గొడుగుకొనడం మంచిదికాదు. ఇటువంటి వస్తువులు ఒక నెల్లాళ్ళయినా మన దగ్గర ఉంటాయని గట్టిగా చెప్పడానికి వీలులేదు. 'ఇది నాది' అనుకోవడానికి వీలులేని వస్తువులను కొనడంకన్నా ఆ డబ్బులు మిగుల్చుకొని ఊరుకోవడం ఉత్తమోత్తమం''—ఇది గజపతి ఉవాచ. నిజమే మరి; కాని గజపతి ఛత్రపతి కావడమే ఒక వినోదం!

"పెద్దవారి మాట చద్దిమూట" అనేదికూడా పెద్దల మాటే! గజపతి–తాను పెద్ద అని చెప్పుకోడు, కాని – ఒకటి రెండు మంచిమాటలు చెప్పి, తరువాత–"పెద్దవారి మాల చద్దిమూట" అంటాడు. ఒక మహారాజుటా, 'మన మహారాజే మనకు దేవుడు' అని ఓ శాసనం చెక్కించి, దాని ప్రక్కనే నిలబడి, వచ్చేపోయే వారితో "దేవుడికి మొక్కండి!" అన్నాట్ట!

అటువంటి గజపతి—"గొడుగు కొంటున్నారా?" అన్నాడు—నేను బేరమాడుతున్న సమయంలో కనిపించి.

అంగడివాడికిధరయిచ్చి, గొడుగుపుచ్చుకొని బయట పడ్డాక–నాతో బాటే నడుస్తూ అన్నాడు: "ఇప్పుడు మీరు ఈ గొడుగు కొనుక్కోకుండా ఉంటే బావుండేది; ఇలా అంటున్నానని మరేమనుకోకండి. ఏదో మీ మోజు; నేను కాదనగలనా? కాని, ఇటువంటి వస్తువులు ఒక నెల్లాళ్ళయినా మన దగ్గర ఉంటాయని గట్టిగా చెప్పలేము. అలవాటు లేనిదిగాబట్టి, ఎక్కడైనా పెట్టి మరచిపోవచ్చు; అవసరం వచ్చిందంటూ స్నేహితుడన్న వాడెవడైనాపట్టుకెళ్ళవచ్చు; లేదా సమయంచూసి ఎవడైనా కొట్టుకుపోవచ్చు! 'ఇది నాది' అని అనుకోడానికి వీలులేని వస్తువులు ఇవి. కనుక—నా సలహా ఏమిటంటే, ఇటువంటి వస్తువులు కొనుక్కోడానికన్నా డబ్బులు మిగుల్చుకొని ఊరుకోవడం ఉత్తమోత్తమం!"

అతని ఈ సలహాలో నూటికి నూరుపాళ్లూ సత్యం ఉందనడంలో సందేహం లేదు. నాకు తెలిసిన చాలా మంది మిత్రులూ అతను ప్రవచించిన అన్ని విధానాల్లోనూ ఎన్నో వస్తువులను ధారవోసుకున్న సంగతి నేనెరిగిందే!

కాని—ఇంత గొప్ప సలహానిచ్చిన అతనిచంకలోనూ ఒక గొడుగుంది. అందుచేత—అతని మాటలు నాకంత సబబుగా లేకపోయినా—నేను వెంటనే—తన వస్తువులను భద్రంగా కాపాడుకోగల సమర్థత ఇతనికి ఉండవచ్చునుకదా అన్న ఆలోచన కలిగింది.

గొడుగు కొనాలన్న సంకల్పం నాకు కలగడానికి కారణ మేమిటంటే—గతించిన రెండు రోజుల వర్షంలో నాలుగుసార్లు జలకాలాడ్డమే.

బట్టకు తగులుకొన్న చీకికంపను వదలించుకొన్నంత జాగ్రత్తగా గజపతిని వదలించుకొని, సర్వారు నమ్రత, వినయవాక్కులు అనుపానంగా హోటలుతిండిని విధిగా భుజించి, నా నివాసానికి దారితీశాను.

వర్షం వచ్చేసూచనలు కనిపిస్తున్నాయి. చలిగాలి వీస్తూంది. ప్రశాంతంగా ఉంది, ఆ ఆదివారం. నా వంటి సాధారణ ఉద్యోగుల నిరంతరమైన బ్రతుకు పరుగులో—కానుగచెట్టు నీడవంటిది ఆదివారం! చల్లనిగాలికి హృదయం హాయితో బరువెక్కిపోతూంది. గది తాళంతీసి, బొంగరం త్రాటిని విసిరినంత జోరుగా పరుపుచుట్టను నేలమీద పరచేసి, కాలుమీద కాలు వేసుకుని హాయిగా కళ్ళుమూసుకుని పడుకున్నాను.

మగతనిద్రలో ఉండగా—కలలోంచి మేల్కొల్పి నట్లు, గది తలుపులమీద వ్రేళ్ళతో చప్పుడు చేస్తూన్నట్లు, పేరెట్టి పిలుస్తూన్నట్లు వినిపించింది. మనసులోనే విసుక్కుంటూ లేచివెళ్ళి తలుపు తీద్దునుకదా- ఇంకెవరో కాదు- గజపతి !

గుండ్రాతికి కాళ్ళువచ్చి గునగున నడిచినట్లు— చూస్తున్నంతలో నేలోపలికి కదిలివచ్చాడు. "నిద్రపోతున్నా రేమిటండీ? నిద్ర మహా చెడ్డది! అలనాటి లక్ష్మణుడు ఎలా జయించకలిగాడో గాని, మనబోటివారి కది సాధ్యమా? ఊర్మిళ కొన్ని సంవత్సరాల తరబడి నిద్రపోయిందంటే— అందులో ఆశ్చర్యమేముందండీ?" అంటూ తనగోడుగును- వంకెను—నా కొత్తగొడుగు ప్రక్కన తగిలించాడు.

అతని మాటల తీరుచూస్తే—అనవసరంగా నన్ను నిద్ర మేల్కొలిపినందుకు ఎంతమాత్రం నొచ్చుకున్నట్లు లేదు. నోటినిండుకూ ఉన్న తమలపాకు ఉమ్మిని కిటికీగుండా బయటికి ఉమిసి—"పగటి పూట నిద్రపోవడం అలవాటు లేకపోయినా, ఎందుకోగాని—చల్లగా కునుకువస్తూన్న దండీ యీ రోజున! కాస్సేపు పడుకొనిపోదామని వచ్చాను. మీ కేమీ యిబ్బంది వుండదు గదా?" అన్నాడు.

"అంతమాత్రానికి యిబ్బంది ఏముంటుందండీ?... నిద్రాదేవి మీద రోతపుట్టేంతవరకూ నిద్రపోండి!" అంటూ అతనికి పరుపుదీసి యిచ్చాను.

గజపతి భుజంమీద కండువాను తీసి పడకమీద పడేసి, శరీరబాధతో ఒక్క మూల్గు మూల్గి, పడకమీద చతికిల బడ్డాడు. నా ఆశ్చర్యానికి అవధులు లేనట్లు అర నిమషానికంతా కందిరీగల రొదలాంటి గుర్రు ప్రారంభ మైంది.

మా పరిచయం ఏమంత చెప్పుకోదగినంత గొప్పది కాదు. కాని, కాలం ఏర్పరచినటువంటి వయోభేదాన్ని బట్టి అతనిపట్ల నాకు గౌరవ భావం ఉండడం సహజమే!

గజపతిరూపం చూపరి హృదయక్షేత్రంలో లోతైన గోయిఒకటితీసి, అందులో—అతనొక పెద్దమనిషి, మర్యాదస్థుడు అన్నటువంటి అభిప్రాయాన్ని రాతి స్తంభంలా నాటేస్తుంది. మనిషి ఎర్రగా ఉంటాడు. రొట్టెలు కాల్చడానికి ముందు పిసికి ఉంచుకొన్న గోధుమపిండి ముద్దలా ఉంటుంది అతని కాయం. అతని తలకాయ—భుజాలమధ్య—ఆకుల్లో కూరుకుపోయి ఉండటం వల్ల అతని మెడ ఉనికి సరిగ్గా తెలియదు. గోచికట్టు కట్టబడి ఉన్న ఎనిమిది మూరల మల్లు పంచె, మోచేతులను దాటి మరినాల్గు వ్రేళ్ళమేర ఆక్రమించుకొన్న తెల్లటి చొక్కా-చేతులు, భుజంమీద పెద్ద కండువా, జేబులో మనీపర్సు, ఊటకలం, ఏవో ఒకటి రెండు మడిచిన కాగితాలు, ఇంచుమించు చేతి మణికట్టు నంతా ఆక్రమించుకొని ఉన్న పాతరకపు పెద్దరిస్టువాచీ, ఒక వ్రేలిన ఉంగరం, కాళ్ళకు బరువైన చెప్పులు, చేతిలో దినపత్రిక—వీటి వల్ల—ఎటువంటి వ్యక్తికయినా అతనిపట్ల గౌరవభావం కలిగి తీరవలసిందే! అతనిది సమీపంలో

ఏదో పల్లెటూరు. మండీ వ్యాపారులతో తనకున్న సంబంధ బాంధవ్యాలను పునస్కరించుకొని-రోజూనో, లేక రెండు రోజులకొక మారో టౌనుకు వస్తూ ఉంటాడు.

బయట కళలు మార్చుకుంటూన్న సూర్యదేవుని కాంతిపుంజాలను చూస్తూ ఆలోచించుకుంటూ ఉండగానే, కనురెప్పలు నిద్ర బరువుతో వాలిపోయాయి.

నిద్రలో గజపతి "ఇక వెళ్ళొస్తానండీ" అనడం, నేను సరేననడం, తలుపు తెరచి మళ్ళీ మూసినట్లు చప్పుడ వడం - ఇంతే నాకు తెలుసును.

సాయంకాలం మెలకువ వచ్చి టైమెంతైందో చూసుకున్నాను. అయిదు గంటలు కావడానికి కొన్ని నిమిషాల కంటె ఎక్కువ వ్యవధి లేదు. గజపతి వెళ్ళిపోయినట్లు మాత్రం నాకు గుర్తుంది. గబ గబ ముఖం కడుక్కోవడం, తలదువ్వుకోవడం, బట్టలు మార్చుకోవడం వగైరాలు క్షణాల మీద జరిగిపోయాయి. ఇక కార్యక్రమాలు రెండే రెండు. హోటలుకు వెళ్ళి కాఫీ త్రాగడం, అక్కడినుంచి పట్టాల వెంబడే దూసుకువెళ్లే రైలుబండిలా సూటిగా క్లబ్బుకు వెళ్ళిపోవడం! ప్రకృతి స్తంభించి పోయినట్టుంది. ఆకాశం మేఘాలతో నిండిపోయి బుడబుడక్కలవాడి పాతగోడుగులా ఉంది. మేఘాలు కయ్యాన్ని కోరుతూ - ఒకదాన్నొకటి కవ్వించుకోవడం ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతూన్నట్లు - సరళంగానే ఉరుముతున్నాయి.

చినుకులు పడుతున్నవేమోనని బయటికి వెళ్ళి, ఆకాశానికి సూటిగా నిలబడి తలపైకెత్తి చూశాను. సూది

మొదలంతటికి సన్నటి చినుకులు కంట్లో ఒకటి, నోట్లో ఒకటి రాలాయి.

'పాడువాన! ఇప్పుడే రావాలీ?' అనుకుంటూ ఉండగానే — నాకు గొడుగుకూడా ఒకటున్నదన్న విషయం జ్ఞప్తికివచ్చింది. సంతోషంతో గది లోపలికి వచ్చి వంకకేసి చూద్దునుగదా - నా కనుగుడ్ల పరిమాణం హెచ్చింది. పైదవడకు క్రింది దవడకు అడ్డంగా మేకునొకదాన్ని నిలబెట్టినట్లు - నా నోరు తెరుచుకుపోయింది. ఆ సమయంలో ఎవడైనా ఛాయాచిత్రకారుడు పొంచి ఉండి నాభంగిమను ఫోటోతీసి. 'ఆశ్చర్యాంబుధిలో' అని వ్యాఖ్య వ్రాసి పోటీలకు పంపిఉంటే, తప్పకుండా బహుమతి లభించి ఉండేది. 'ఆశ్చర్యాంబుధిలో' కొంత సేపటివరకు నాకు గుక్కతిరిగింది కాదు. నా కొత్త గొడుగు కొన్ని గంటల్లోనే ముసలిదై పోయింది. ఆ గొడుగును చూస్తుంటే చీకట్లో వెలిగించిన కాకరవత్తిలా నా మెదడులో గజపతి మెరిశాడు. గొడుగుల మార్పుదలకు కేవలం అతని పొరపాటే కారణమై ఉండవచ్చు. వదిలీ వదలని నిద్రమత్తులో ఏ గొడుగు ఎవరిదో గమనించకపోయి ఉండవచ్చు. నాగదికి సమీపంలోనే నాలుగు వీధుల కూడలి ఉంది. గబ గబ అక్కడికెళ్ళి, తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యప్రదక్షిణం చేసే భూగోళంలా ఒక్కొక్క వీధికి అభిముఖంగా నిలబడి చుట్టూ ఉన్న నాలుగు వీధులకేసి దృష్టిని సారించేశాను. సీత నెత్తుకపోవడానికి ఆరోజుల్లో రావణాసురుడు పుష్పక విమానంతో

వచ్చాట్టగానీ - ఈ గజపతి తనవెంట ఏ విమానాన్ని తెచ్చు కున్నాడో నాకర్థం కాలేదు.

నిజానిజాలు తెలుసుకోకుండా అతన్ని అనుమానించడం నా వ్యక్తిత్వాన్ని, సంస్కారాన్ని మలినపరచుకోవడమే అవుతుంది. పరుశ్యా, ప్రతిష్ఠా ఉన్నవాడైతే తన పొరపాటుకు క్షమాపణ కోరుతూ నా వస్తువును నాకు అప్పగించి, తన వస్తువును తీసుకోకపోడు. అంతవరకు అతని గొడుగును భద్రపరచడం నా విధి.

గజపతి గొడుగును ముట్టుకోనైనా ముట్టుకోకుండా గది తలుపు తాళంవేసి, చినుకులన్నీ ఒకదానితో ఒకటి కూడబలుక్కునే లోపున హోటలు చేరుకున్నాను. కాఫీ తీసుకరమ్మని చెప్పి, సర్వారుమీదనుండి చూపుల్ని ప్రక్కకు మరల్చగానే—ఎట్ట ఎదుట—కాఫీ కప్పును పెదవుల దగ్గరకు చేర్చుకుంటూ నావైపు వోరకంటితో చూస్తున్న గజపతి కనిపించాడు. అతని చేయివణికి, కాఫీకాస్తచింది క్రిందకి జారడం గమనించాను. అతను కంటపడగానే నామనస్సులో ఒకమూల ఆశ రేకెత్తింది. అతను నన్నుచూచి "మీ... మీ...గొ...గొ..." అంటూ తడబడ్డాడు. ఒకే మాట మీద నిలిచిపోయిన రికార్డు పాటలా వున్నాయి అతని మాటలు. కాస్సేపటికి నింపాదిగా అన్నాడు. "నా గొడుగు మీగదిలోనే ఉండిపోయింది. తెలియక నాగొడుక్కి బదులు మీ గొడుగు తెచ్చేశాను. ఇరవై మైళ్ళలో ఉన్న ఒక ఊరికి వెళ్తూ నా స్నేహితుడొకడు మీ గొడుగు తీసుకెళ్ళాడు. నాదికాదని ఎంత చెప్పినా వినలేదు. ఏంచెయ్యను?

రేపు అతను వచ్చినప్పుడు మీగొడుగు మీకు చేరవేస్తాను లెండి..." అతను ఈ మాటలనగానే నా గుండెల్లో బండ పడినట్లయింది. పుస్తకం, వనితావిత్తం, మరియు నాఛత్రం పరహస్తం గతంగతః! పైకిమాత్రం "అట్లాగే కానివ్వండి!" అనేశాను.

హోటలుగడప దాటుకోబోతుండగానే హోటలు ముందున్న సీనారేకుల కప్పు దడదడమంది. వరుణదేవుడు భూమిమీద ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. రోడ్డుపై నున్న జనం ఎక్కడివారక్కడ మాయమైపోయారు. కొంతమంది హోటలు ప్రాంగణంలోని రేకు కప్పుక్రిందకు పరుగెత్తు కొచ్చి తలలు దాచుకున్నారు. గత్యంతరంలేక నేనూ నిమి షాలు లెక్కించుకుంటూ, అరగంటసేపు అక్కడే ఆగి పోయాను. వర్షం ప్రారంభమైన కొద్దిసేపటికే కొన్ని గొడు గులు తచ్చాడ్డం మొదలైంది. గజపతి నా వెనుకనిలబడి— "అమ్మ బాబోయ్! ఈ వర్షంలో మూడుమైళ్ళు ఎలా నడచి వెళ్ళగలను?" అంటూ తన భయాన్ని వెళ్ళగక్కాడు. అతనిమీద నాకు జాలి కలిగినా, నా చేతనైన సహాయం అతన్ని ఓదార్చడమే! "మీ గొడుగును నేనైనా తెచ్చిన వాణ్ణికాను; మీరీ వర్షానికి భయపడవలసి వచ్చేదికాదు" అన్నాను అతన్ని అనునయిస్తూ.

ఇంతలో రోడ్డుమీద గొడుగుక్రింద సురక్షితంగా నడచి వెళ్ళుతూన్న నామిత్రుడు కంటబడగానే నాప్రాణాం

లేచి వచ్చినట్లయింది. గ్రద్దనుచూచి బెదిరి తల్లిరెక్కలక్రిందికి పరుగెత్తే కోడిపిల్లలా అతనిగొడుగు క్రింద దూరాను.

*   *   *

గజపతి ఆ తర్వాత రెండు రోజులవరకు గానీ కని పించలేదు. ఆ రెండురోజులూ అతని దర్శనంకోసం అల్లాడి పోయాను. ఆ రెండు రోజులకే ఓపికను కోల్పోయిన నా దృష్టికి—భగవద్దర్శనార్థం వేలాది ఏండ్లు నిగ్రహంతో తపస్సుచేసిన మన పూర్వీకులు మానవమాత్రులుగా ఎలా కనిపించగలరు? గజపతి మాటల్లో మళ్ళీ నాకు నిరాశే ఎదురైంది. "నేను ముందే చెప్పాను—ఇటువంటి వస్తువు లను మనం భద్రపరచుకోలేమండీ—అని. నా సలహా విని వుంటే ఇందాకా వచ్చేదికాదు. ఊరికే అన్నారా పెద్దల మాట చద్దిమూట అని? గొడుగెత్తుకెళ్ళిన మిత్రుడు వల్ల కాటికి వెళ్ళినట్లే ఉన్నాడు. అయినా ఇప్పుడేమైందిలే? అతను మళ్ళీ రాకపోడు. వచ్చినప్పుడు మీ గొడుగు మీకు అప్పగించే పూచీనాది. అంతవరకు నా గొడుగును మీ దగ్గరే ఉండనివ్వండి..." అంటూ కనిపించిన వాడు కను పించినట్లే వెళ్ళిపోయాడు గజపతి.

ఆ పిదప ఒక నెలరోజులు గడిచిపోయాయి. ఈ నెలరోజుల పొడుగునా గజపతి నాపాలిట ఒక ఎండ మావిగా మాత్రమే ఉండిపోయాడు. అతను కనుపించ డమే అరుదైంది. కనుపించినా అతనికీ, నాకూ మధ్య ఏ ఫర్లాంగుదూరమో వుండేది. దగ్గరికి వెళ్ళగానే—

"శ్రీకృష్ణుడు ఏ చెట్టుచాటున దాగినాడో, ఏ పుట్టచాటున నక్కినాడో" — అంటూ తికమక పడిపోయే గోపిక అవస్థలా ఉండేది నా పని.

నా కొత్త గొడుగును గురించిన సమస్య నన్ను బాధించడంలేదు. గానీ గజపతి విడిచిపోయిన పాతగొడుగే కొత్తసమస్యగా పరిణమించింది. నా దైనందిన జీవితంలో అదొక అసంతృప్తిగా, మనస్సులో ఒక మచ్చగా నిలిచిపోయింది.

గొడుగు ఎంత పాతదంటే - గుడ్డరంగు చాల వరకు మాసిపోయింది. గొడుగు శీర్షభాగంలో కొన్నికుట్లు సడలిపోయాయి. లోపల కమ్ములు ఒకటి రెండు ఊడిపోయి వున్నాయి. కర్రి పుచ్చిపోయి సన్నటి బెజ్జాలతో నిండిపోయింది. గజపతి దీన్నికూడ తీసుకొని వెళ్ళిపోయి వుంటే బావుండేది. నేను గదిలో ఉన్నప్పుడు ప్రతి నిమిషం ఇది నా కంటబడుతూంటే — గజపతితోబాటు నా క్రొత్త గొడుగు జ్ఞాపకం వచ్చేది. కాలిలో ముల్లులాగా ఏదో వెలితి నా మనస్సును పీడించేది.

గజపతి ఆగొడుగును ఎక్కడ, ఎలా ఉంచిపోయాడో అక్కడ అలాగే ఉండిపోయింది. దానితో నాకు అవసరం ఉన్నా ఎప్పుడూ ఉపయోగించలేదు. దాన్ని చేత బుచ్చుకొని వీధులవెంట వెళ్ళాలంటే నాకు సిగ్గనిపించింది. అందు చేత దాని శిథిలరూపం నా కెంతమాత్రం ఉపయోగకరం కాకపోగా చరిత్ర పుటల్ని త్రిప్పిచూపించే శిథిల దుర్గంలా కేవలం ఒక స్మృతి చిహ్నంగా మాత్రమే నిలిచిపోయింది.

వర్షాకాలం పేరుతో అప్పుడప్పుడూ వానలు కొద్దో గొప్పో కురుస్తూనే ఉన్నాయి. నా బాధ నేను పడుతున్నానేగాని, నా కోసం పాతగొడుగును మాత్రం ఎప్పుడూ బాధించలేదు. ఒకనాటి ఉదయం సన్నసన్నగా తుంపర రాలుతుంటే ఒకానొక ఆప్తమిత్రుడు వచ్చి, తొందరపనిమీద ఏదో పల్లెకు వెళ్ళిరావాలని చెప్పి గొడుగు ఇమ్మని అడిగాడు. ఇచ్చాను. ఆరోజు సాయంకాలం నుంచీ రాత్రి తొమ్మిది, పదిగంటలదాకా భూమ్యాకాశాలు దద్దరిల్లిపోయేటట్లు ఎడతెరిపిలేకుండా గొప్ప వర్షం కురిసింది. గది కిటికీరెక్కలు ఫెడేల్ ఫెడేల్ మంటూ కొట్టుకున్నాయి. వానజల్లు లోపలికి వచ్చిపడి, గదంతా నీళ్ళమడుగై పోయింది. వీధుల్లో వరదలు ప్రవహించాయి. చరమావస్థలో ఉన్న మొండి గోడలు కొన్ని కూలిపోయాయి.

మరునాటి ఉదయం గదినుండి బయిలుదేరబోతూండగా పాతగొడుగు తీసుకువెళ్ళిన మిత్రుడు లోపలికి వచ్చాడు. అతని - చేతిలో ఏదో గోతం చుట్ట ఉంది. అతడు ఉలుకూ పలుకూ లేక గోతంచుట్ట విప్పాడు. అందులోనుండి జానడేసి కర్రముక్కలు, మూడు బయటికి లాగాడు. ఆ తర్వాత కొన్ని వంగిపోయిన కమ్మీలు, చీలికలు పీలికలైన నల్లగుడ్డ- వీటినంతా పళ్ళెరంలో అర్చనద్రవ్యాలుంచి పూజారి కిచ్చినట్లు ఒకచోట కుప్పగా పేర్చి జాలిగా నావేపు చూశాడు. నాకు కోపం ముక్కువరకు, నవ్వు నోటివరకు వచ్చి ఆగిపోయాయి.

"వర్షంలో నా మానాన నేను నడిచివస్తుంటే_వెధవ సుడిగాలి వచ్చి నన్నే కౌగిలించుకోవాలి?" అంటూ ప్రారంభమైన అతని సాహసగాథను అంతటితో తెంపేస్తూ "ఏడవలేక పోయావ్? అక్కడే పారేసిరాకుండా యిక్కడి కెందుకు ఏరి తెచ్చావ్?" అని, అతని చేతిలోని సంచి లాక్కుని, గొడుగుకు సంబంధించిన వివిధ భాగాలన్నీ అందులో వేసి, యథాప్రకారంగా చుట్ట చుట్టి చేతబట్టుకుని, గది తాళం వేసి అతనితోపాటు బయటపడ్డాను. నా గది ఓ వైపున అతి సమీపంలో పంటపొలాలున్నాయి. వాటి మధ్య ఒక పాడుబడిన మోటబావి ఉంది. అందులో అట్టడుగున ఎక్కడో ఎర్రటి వాననీరు నిలిచి ఉంది. అక్కడికి వెళ్ళి, సంచివిప్పి అందులోని ఒక్కొక్క భాగాన్నితీసి బావిలోకి విసిరేశాను. "నిన్న వానలో తడిసి జబ్బుచేసింది. ఆస్పత్రికెళ్ళొస్తా"నంటూ ఖాళీసంచిని తీసి చంకన పెట్టుకుని మిత్రుడు వెళ్ళిపోయాడు. నేను బజారువేపు దారితీశాను.

నెల రోజుల తర్వాత ఆనాటికి నా మనస్సు చల్లబడింది. ఏ నిరుపయోగకరమైన వస్తువైతే నన్ను తీరని అసంతృప్తి పాలుజేసిందో, అది ఇకమీదట కంటికైనా కనిపించదు. దాన్ని ఇక పూర్తిగా మరిచిపోవచ్చు. నాలోని బరువు మాయమైపోయి, మనస్సు తేలికపడింది.

హోటలు సమీపిస్తుండగా - అనుకోకుండా గజపతి కనిపించాడు. నన్ను చూసి "మరి... మీ గొడుగు... మీ గొడుగు..." అంటూ తొట్రుపడ్డాడు. నా మనస్సులో నుండి మాటలు చకచకా తేలిగ్గా బయటికి దూకేశాయి.

"ఆ బెంగ ఇకమీాదట మీా కనవసరం లెండి. నేను అడగ దల్చుకోలేదు. ఎందుకంటే, మీా గొడుగు నామరూపాలు లేకుండా పోయింది. నిన్నటి చిన్న సుడిగాలికి తన ముసలి తనువును చాలించింది. పాపం!..." అంటూ ముందుకు కదలబోయాను. గజపతికి ఈ వార్త సంతోషదాయకంగా ఉంటుందనుకున్నానుగాని, అతడు మరోలా వాపోగలడని నేను కలలో కూడా అనుకోలేదు. "ఆఁ! ఆఁ! ఎంతపని జరిగింది? నా గొడుగు పోయిందా? అది నాకు ప్రాణ సమానమైనదే! మా తండ్రి పోతూపోతూ—దాన్ని నా కిచ్చి పోయాడు. అదేమీా రొక్కరోజవాలు విలువచేయక పోయినా, దాన్ని చూస్తూ మా నాన్న ఇంకా బ్రతికే ఉన్నాడని అనుకునేవాడిని. మా అమ్మ అంటూనే ఉండేది పాపం!—'ఒరేయ్! దాన్ని బయట కెక్కడికీ తీసుకుపోవద్దురా. దాన్ని పోగొట్టేవరకు నువ్వు నిద్రపోవేమిట్రా!' అని. ఆమె మాట వినకపోయాను. వూరికే అన్నారా—పెద్దలమాట చద్దిమూట అని? మీాగొడుగుని నిన్నతీసుకొచ్చి యిచ్చాడు మిత్రుడు. ఇప్పుడు యింటినుండి వస్తూ తెచ్చి మీాకిచ్చేద్దా మనుకుని, మర్చిపోయాను. ఇంతలో జరగవలసిందేదో కాస్త జరిగిపోయింది. సరే! సెలవండీ, ఇక..." అంటూ ప్రశాంతంగా ముందుకు సాగవారాడు గజపతి. ఆ క్షణం వరకు తెలుసుకోలేక పోయాను— ఇతడు ఏ ఎండకు ఆ గొడుగుపట్టగల సమర్థుడని.

* * *

ఆ మరువాడు-సెగలు గక్కుతున్న ఎండలో గొడుకు క్రింద నీడలో గునగున నడచిపోతూ కనిపించాడు గజపతి. అది నెలరోజుల క్రితం నా కష్టార్జితంతో కొన్న కొత్త గొడుగు.

అతడు గొప్ప సామ్రాజ్యాన్ని ఆక్రమించుకొన్నంత ఉత్సాహంతో, ఠీవితో ఛత్రచ్ఛాయనంతా ఆక్రమించుకొని తమలపాకు నములుతూ, ఎడమ చేతిలో గొడుగును అటూ ఇటూ చిన్నగా తిప్పుకుంటూ, దినపత్రిక ఉన్న చేతిని స్ప్రింగులా ముందుకూ వెనుకకూ ఊగించుకొంటూ నడిచిపోతున్నాడు. ఒకసారి నావైపు చూచుకున్నాను. ఎండకు ఒళ్ళంతా చెమటలు గక్కుతూ ఉంది. తల మాడిపోతూంది. అతను గొడుగు నీడలో చల్లగా, సెలయేరులా పోతున్నాడు. అతనివైపు చూడాలంటే, అతనికంట బడాలంటే కూడా నాకు తలకొట్టేసినంత సిగ్గువేసింది. కాని, నా ఆలోచనలతో తనకేమీ నిమిత్తం లేనట్లు నన్ను చూచి ఒక్క చిరునవ్వు మాత్రం విసరి, గొడుగును ఈ చేతినుండి ఆ చేతికి మార్చుకుని నన్ను దాటిపోయాడు గజపతి... కాదు.. కాదు... ఛత్రపతి.